
www.prajasakti.com

ప్రజాశక్తి





శనివారం 18 ఫిబ్రవరి 2023

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం



ప్రజాశక్తి-ఉలవపాడు: ఉలవపాడులోని అంబేద్కర్ నగర్ న్యూ రైల్వే రోడ్, పాతూరు తదితర ప్రాంతాలలో యుటిఎఫ్, సిఐటియుల ఆధ్వర్యంలో మార్చి 13న జరుగుతున్న ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పిడిఎఫ్ తరఫున ఇంటింటికి కరపత్రాలు అను పంచారు. శుక్రవారం మూడు దళాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొక్కి రెడ్డి బాబు రెడ్డికి కూడా ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కలిసి అభ్యర్థించారు. సిఐటియు జిల్లా నాయకులు జివిబికుమార్ మాట్లాడారు. ఉద్యమాలు,, పోరాటాలకు అండదండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.నాగేంద్రరావు, ఎస్ జాలయ్య, ఏ.గోపాల్ రెడ్డి, ఎన్.మురళి, మహమ్మద్ రఫీ, ఎం శ్రీనివాస్, కత్తి రమేష్, మెహర్ అలీ,.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌లో 'ఆట'మొదలైంది..!

- ఎంఎల్ఎ ముఖ్య అనుచరుడు అరెస్ట్
- స్టేషన్ వద్ద 'కోటంరెడ్డి' హల్‌చల్

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ గేమ్ ప్రారంభమైంది. వైసిపిలోని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల ఆపార్టీని వీడారు. టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు చేస్తున్న కోటంరెడ్డిని కట్టడి చేయడానికి వైసిపి అధిష్టానం పడరాని పాట్లు పడుతోంది. శ్రీధర్‌రెడ్డి దూకుడు ఆపడం లేదు. నియోజకవర్గంలో మీటింగ్‌లు పెట్టడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. కోటంరెడ్డి నుంచి ఇప్పటికే కార్పొరేటర్లు, నేతలు, సర్పంచ్‌లను వైసిపి తనవైపు తిప్పుకుంది. మిగిలిన నేతలు, కార్పొరేటర్లను బయటపెట్టడానికి రంగంలోకి దిగింది. అందులో భాగంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అనుచరులు తాటి వెంకటేశ్వర్లును శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎంఎల్‌ఎ కోటంరెడ్డి నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి కూర్చున్నారు. న్యాయ పోరాటం చేస్తాను, భయపడే ప్రశ్నలేదని తేల్చి చెప్పారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం తన ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడంలో వెనుకడుగు వేయడం లేదు. అది అధికార పక్షమైనా, స్వపక్షమైనా, కార్మికు లైనా ఒక్కటే. ఇప్పటికే ఆపార్టీని వ్యతిరేకించిన రఘురామకృష్ణం రాజు నుంచి టిడిపి, ఇతర ప్రతిపక్షాలు ఇబ్బందులకు గురిచేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ జాబితాలో నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేరారు. తాను వైసిపిలో ఉన్నప్పుడు అనేక మంది ప్రతిపక్షాలు, ఇతరులపై దాడులకు దిగిన విషయం తెలిసిందే. కేసుల విషయంలో పోలీసులు అధికారపార్టీ నేతలకు వత్తాసు పలికారు. ఇప్పుడు వైసిపిని వీడడంతో అదే పరిస్థితి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రారంభమైంది. నెల్లూరు రూరల్‌లో బలమైన రాజకీయ శక్తిగా ఉన్న కోటంరెడ్డిని ఓ పథకం ప్రకారం దెబ్బ కొడుతోంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థిగా ఉంటారని తేల్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 26 డివిజన్లు ఉన్నాయి. 26 మంది వైసిపి కార్పొరేటర్లు గెలిచారు. అంద రూ నిన్నటి వరకు ఎంఎల్‌ఎతోనే ఉన్నారు. ఇప్పుడు రాజకీయ సమీకరణాలలో భాగం 17 మంది కార్పొరేటర్లు ఆదాల గ్రూపులో చేరారు. 18 మంది సర్పంచ్‌లుండగా, కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డితో ఆరుగురు మాత్రమే మిగిలారు. అధికారిక పగ్గాలు సైతం ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అప్పగించారు. అయినప్పటికీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెనక్కి తగ్గడం లేదు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పి స్తున్నారు. నియోజకవర్గంలో ప్రజా బలం పెంచుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే 17వ డివిజన్ రవీంద్రనగర్, 22 డివిజన్ భక్తవత్సలనగర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశాలు విజయవంత మయ్యారు. శుక్రవారం జరిగిన ముస్లిముల సమావేశం విజయ వంత మైంది. ఈ నేపథ్యంలో కోటంరెడ్డితో తిరుగుతోన్న నేతలను భయపెట్టే పనిలో వైసిపి నేతలు దిగారు. ముఖ్యనేతలను అరెస్ట్ చేసేం దుకు సన్నాహాలు మొదలు పెట్టారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ ఆటలు ప్రారంభ మయ్యాయి.



పోలీసు స్టేషన్‌లో ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

"కోటంరెడ్డి" ముఖ్య అనుచరుడు అరెస్ట్..!

నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు తాటి వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి 6,30 గంటల సమయంలో బొల్లినేని ఆసుపత్రి వద్ద ఉండగా పోలీసు వాహనంలో మఫ్టీలో వచ్చిన వారు ఆయనను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. విషయం కోటంరెడ్డికి తెలియడంతో ముందుగా డిఎస్‌పికి ఫోన్‌చేసి అడిగారు. తనకు తెలియదని సమాధానం చెప్పడంతో ఎస్‌పి విజయ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగారు. తాటి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసిన మాట వాస్తవమేనని చెప్పడంతో ఆయన తన అనుచరులతో ఐదో నగర పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో అధికారులతోపాటు, వెంకటేశ్వర్లు లేరు. వెంకటేశ్వర్లు ఆచూకీ తెలిపే వరకు ఇక్కడ నుంచి వెళ్లే ప్రశ్నేలేదని చెప్పారు. డిఎస్‌పి ఎంఎల్‌ఎకు ఫోన్‌చేసి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసిన మాట వాస్తవమేనని, మరో స్టేషన్‌లో విచారణ జరుపుతున్నా మని, 24 గంటల్లో కోర్టులో హాజరుపరు చుతామని హామీ ఇచ్చారు. దీంతో ఎంఎల్‌ఎ వెను తిరిగారు. స్టేషన్ వద్ద ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మాతంటి కృష్ణపై హత్యాయత్నం జరిగిన సమయంలో కేసు ఏమీ లేదని చెప్పిన పోలీసులు నాలుగు నెలల తరువాత తనతోఉన్న వ్యక్తులను అరెస్ట్ చేయడానికి ఈ కేసును బయటకు తీశారని తెలిపారు. నన్ను భయపెట్టడానికి ఇలాంటి చర్యలకు దిగుతున్నారని భయపడ నన్నారు. న్యాయమైన పోరాటం చేస్తామని తెలిపారు. నాలుగు నెలల క్రితం టిడిపి నేత మాతంటి కృష్ణపై దాడి చేశారు.అప్పట్లో వైసిపిలోని కార్పొరేటర్లు, వైసిపి నేతలు ఈ కేసులో ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేసును పోలీసులు పక్కన పడేశారు. ఇప్పుడు శ్రీధర్‌రెడ్డి వైసిపిలో లేకపోవడంతో పోలీసులు కేసును మళ్లీ బయటకు తీశారు. అధికారపార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు మరో న్యాయం పోలీసులు పాటించడం పట్ల తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు.

మిస్సింగ్ కేసు ఛేదింపు

ప్రజాశక్తి-నెల్లూరు

ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికల మిస్సింగ్ కేసును ఛేదించడంలో జిల్లా పోలీసులు కీలక పాత్ర పోషించారని ఎస్‌పి సిహెచ్ విజయరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూల్‌లోని కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలు పారిపోయినట్లు మిస్సింగ్ కేసు నమోదైందని, సాంకేతికత ఆధారంగా అనుమానితుల ఫోన్ నెంబర్లను ట్రేస్ చేయగా నెల్లూరు వైపు ప్రయాణిస్తున్నట్లు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక బృందం గుర్తించిందన్నారు. ఈ సమాచారాన్ని మర్రిపాడు ప్రాంతంలో వాహనాలు తనిఖీ, ఫేస్‌వాష్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆత్మకూరు సిఐ, మర్రిపాడు ఎస్‌ఐలను అలెర్టు చేసి బాలికలను రక్షించేందుకు వస్తున్న ప్రత్యేక బృందానికి తోడ్పాటు అందించాలని సూచించామన్నారు. మర్రిపాడు ఎస్‌ఐ మరో మారు ప్రత్యేక బృందంతో కలిసి సాంకేతికత ఆధారంగా పరిశోధన చేయగా అనుమానితుల కదలికలు నెల్లూరు పరిధిలోనే ఉన్నట్లు నిర్ధారణ చేసుకున్నామన్నారు. వెంటనే రాత్రి సమయంలో హైవే మొబైల్స్, టోల్ ప్లాజాలను అప్రమత్తం చేసి వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఈ క్రమంలో డిసి పల్లి టోల్ ప్లాజా వద్ద ప్రయాణిస్తున్న లారీని నిలిపి పోలీసులు తనిఖీ చేశామన్నారు.

ఈ తనిఖీల్లో బాలికలు కనిపించకపోవడం, పోలీసులు ట్రేస్ చేసిన ఫోన్ నెంబర్లు డ్రైవర్, క్లీనర్ సెల్‌ఫోన్ నెంబర్లకు సరిపోయాయి. వెంటనే పోలీసులు క్లీనర్ ను విచారించగా అసలు సమాచారం తెలిసిందన్నారు. ఇద్దరు బాలికలను క్లీనర్, మరో వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేసి, హాస్టల్ కిటికీ నుంచి దూకి పారిపోయి వచ్చి కర్నూల్ లోని లాడ్జిలో ఇద్దరు బాలికలను, మరో వ్యక్తిని ఉంచి కృష్ణపట్నం పోర్టులో లోడింగ్ కు వెళ్లి వచ్చాక, తల్లిదండ్రులకు దూరంగా రాష్ట్రాలు వదిలి పారిపోవాలని నిర్ణయించుకున్నట్లు గుర్తించామన్నారు. బాలికలు పారిపోయినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, తక్షణమే పోలీసులు స్పందించడంతో క్లీనర్, మరో వ్యక్తి రచించిన ప్రణాళికలను భగ్నం చేసి, చాకచక్యంగా అసలు సమాచా రాన్ని పోలీసులు గుర్తించారన్నారు. కర్నూల్ పోలీసులను లాడ్జికి పంపించి, బాలికలను గుర్తించి, క్షేమంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించగా వారు సంతోషంతో కన్నీటి పర్యంతమై నెల్లూరు పోలీసులకు కతజ్ఞతలు తెలియజేశారన్నారు. ఎంతో తోడ్పాటు అందించి మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులకు కర్నూల్ పోలీసులు కతజ్ఞతలు తెలియజేశారు. మర్రిపాడు ఎస్‌ఐ, ఆత్మకూరు సిఐలను, పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఎపి జెన్కో పోరాటానికి విరామం

ప్రయివేటీకరించమని హామీ
మాట తప్పితే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-నెల్లూరు

ఏపీ జెన్కో శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రయిటీకరణను తాత్కాలికంగా విరామం ప్రకటించామని, టెండర్ల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జెన్కో మేనేజ్మెంట్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఏపీ జెన్కో వద్ద 396 రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రజేఏసీ, ఏపీ జెన్కో జేఏసీ, పరిరక్షణ కమిటీ నాయకులు ప్రకటించారు. ఏపీ జెన్కో వద్ద శుక్రవారం 396 రోజుల పోరాట సభపరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం. మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఇంజినీర్లు, రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పవర్ జేఏసీస్టేట్ జనరల్ సెక్రటరీ ప్రతాపరెడ్డి, చైర్మన్ ప్రతాప్, కో చైర్మన్ శేషారెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు)రాష్ట్ర అధ్యక్షులు డి. సూరిబాబు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి శివయ్య ప్రసంగిస్తూ మేనేజ్మెంట్ ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా ఈ ఉద్యమాన్ని విరమిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ జెన్కో ప్రయివేటీకరణకు తిరిగి పూనుకుంటే మెరుపు సమ్మెకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు. ఏపీ జెన్కో జేఏసీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం. మోహన్ రావు మాట్లాడుతూ 396 రోజులుగా జరిగిన పోరాటానికి మద్దతునిచ్చిన విద్యుత్ ఇంజినీర్లు, రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు, అన్ని రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటేకరణ నిర్ణయాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, భవిష్యత్తులో ప్రయివేటీకరణకు పూనుకుంటే ఏపీ జెన్కో నుండి మహా పాదయాత్ర నిర్వహిస్తామని, ఏపీ జెన్కో ముట్టడికి సైతం వెనుకాడేది లేదని తెలియజేశారు. ఉద్యమాన్ని వివిధ రూపాలలో కొనసాగిస్తామని ప్రకటించారు. ఇంజినీర్ల అసోసియేషన్ నాయకులు గుమ్మడి శ్రీనివాసులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి ,రాష్ట్ర కార్యదర్శి బొమిసురేంద్ర, రామ్మోహన్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు టీవీ ప్రసాద్ ,ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు శంకర్ కిషోర్, ఏఐఎఫ్‌టియు న్యూ జిల్లా నాయకులు లక్ష్మీరెడ్డి, పి. యానాదయ్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కే. రాంబాబు ,సిఐటియు ఇండస్ట్రియల్ కారిడార్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుమన్, ఏపీ జెన్కో జేఏసీ నాయకులు సిహెచ్. ఆదిశేషయ్య ,అనిల్ ,భాస్కర్ ,నక్క మోహన్ రావు, ఆదిలక్ష్మి, ఎం రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-వెంకటాచలం: మండలంలోని ఏపీటీఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ తరపున శుక్రవారం ఉద్యోగ ఉపాధ్యా యులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్యం వహిస్తుందన్న కారణం పై రెవెన్యూ అధికారికి సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ని వారం రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పిన విషయం నలుగుతుందన్నారు. అదే రకంగా డిఏలు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. 12వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మూడు నాలుగు ఐదు తరగతుల వీలీనాన్ని ఆపాలి ప్రతినెలా ఒకటో తేదీ ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతభత్యాలు అందేలా చూడాలన్నారు. ఇలాంటి అనేక సమస్యలపై వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జె.నరసింహయ్య, డి.శ్రీనివాసులురెడ్డి, మాల కొండయ్య, సుబహాన్, రామమోహన్ ,పెంచలయ్య, చెన్నయ్య, శ్రీధర్, శివ పాల్గొన్నారు.

కృష్ణ చైతన్యలో ఫ్రెషర్స్ డే సంబరాలు

ప్రజాశక్తి-నెల్లూరు: కాకుటూర్ లోని కష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ అఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థుల ఫ్రెషర్స్ డే సంబరాలు అంబరాన్న ంటాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్స్ కి ఘనంగా స్వాగతం చెబుతూ కాలేజీలో ఈ కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమాన్ని కష్ణ చైతన్య విద్య సంస్థలు డైరెక్టర్స్ డాక్టర్ ఆర్.వి కృష్ణారెడ్డి, శ్రీ చంద్ర శేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంబించారు.కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జునయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాలేజీలో విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు విద్యార్థులకు నేర్పించుతున్నామన్నారు.

వేలం కేంద్రం బయట అమ్మకాలు, కొనుగోళ్లు చట్టానికి వ్యతిరేకం

ప్రజాశక్తి-కందుకూరు: పొగాకు వేలం కేంద్రం బయట పొగాకు కొనుగోళ్ళ, అమ్మకాలు చేయటం పొగాకు బోర్డు చట్టానికి వ్యతిరేకమని వేలం కేంద్రం అధికారి కె.రాజగోపాల్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం వేలం కేంద్రం అధికారి అనధికార పొగాకు కొనుగోళ్ల గురించి మాట్లాడారు. వేలం కేంద్రం బయట పొగాకు కొనుగోళ్ళు చేస్తూ, లేక అమ్ముతూ పట్టుబడితే దొరికిన పొగాకును సీజ్ చేసి అధిక మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామన్నారు. పట్టుబడిన వ్యక్తులపైన సైతం బోర్డు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పొగాకును అక్రమంగా కొనుగోలు చేయటానికి ఎవరైనా బ్రోకర్లు గ్రామాల్లో తిరు గుతూ పొగాకును అక్రమంగా కొనుగోలు చేసినా లేదా నిల్వ చేసినా ఆ సమాచారాన్ని పొగాకు బోర్డు విజిలెన్స్ లేదా కందుకూరు పొగాకు బోర్డు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పొగాకు అక్రమ కొనుగోళ్ల నియంత్రించటంలో పొగాకు బోర్డుకు సహకరించాలని రైతులను కోరారు. పొగాకు అక్రమ కొనుగోళ్ల గురించి బోర్డు అధికారులకు సమాచారం అందిస్తే తగిన పారితోషికం ఇస్తారని తెలిపారు. అనధికార పొగాకు కొనుగోలు జరగకుండా రైతులందరూ పొగాకు బోర్డుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



వేలం కేంద్రం అధికారి కె.రాజగోపాల్

దేవాలయంలో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: శ్రీ అంకమ్మ తల్లి దేవాలయం పున:నిర్మాణ పనులను దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఆజాద్, శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. దేవాలయ నిర్మాణ పనులు బాగా జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. దేవాలయ ఆదాయం పెంచేందుకు చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో 30 షాపులు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. షాపులు కావలసినవారు డిపాజిట్‌గా 5లక్షల రూపాయలు చెల్లించాలన్నారు. డిపాజిట్ కింద చెల్లించిన ఐదు లక్షల రూపాయలు తిరిగి ఇవ్వరని తెలిపారు. పెద్ద షాపుల వేలం రూ.7వేల నుంచి చిన్న షాపులు వేలం రూ.5వేల నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఎక్కువ పాడిన వారికి మాత్రమే ఈ షాపులను కేటాయిస్తారని తెలిపారు. మూడేళ్లకోసారి 15శాతం పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి, దేవాలయానికి సంబంధించిన వివరాలను వివరించారు.కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, ఆవుల మాధవరావు, తలపనేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



20 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ఈనెల 20 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్స్ విద్యార్థులకు, ఈనెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఎంపీసీ, బైపిసి విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డిఆర్‌ఓ తెలిపారు. జిల్లాలో 23150 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలనిఅధికారులకు సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కరేడు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పిన్ని మానస జనవరిలో మార్కాపురం మండలం, గజ్జలకొండ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికై ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు గజ్జలకొండ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణా శిబిరంలో పాల్గొంటారు. వచ్చే నెలలో చిత్తూరు జిల్లా నగరిలో జరుగు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 కబడ్డీ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓగుబోయిన శ్రీనివాసులు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మానసను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీధర్ రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.



పాదయాత్రలు అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-కందుకూరు: ప్రతిపక్ష నేతల పర్యటనలకు వస్తున్న ప్రజాస్పందనను చూసి సిఎం జగన్మోహన్ రెడ్డి వణికి పోతున్నారని, అందుకే అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్నారని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరం రావు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని పట్టణంలోని 25వ వార్డు కల్లూరి ప్రశాంతి నగర్, కోటయ్య నగర్ ప్రాంతా ల్లో శుక్రవారం నిర్వహించారు. ఇంటూరి నాగేశ్వరరావుతో పాటు పార్టీ ముఖ్య నేతలు ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి లో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారని, వేలమంది పోలీసులను మోహరించి టిడిపి శ్రేణులను భయభ్రాంతులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, ముప్పాళ్ళ శ్రీనివాసులు, చిట్టా బత్తిన మాలకొండయ్య, బత్తిన మాల్యాద్రి, కొమ్మి వెంకట ప్రవీణ్ కుమార్, సవలం కేశవులు, నవీన్ కుమార్, వెంకటేష్, మధు, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, కూనం నరేంద్ర, గోచిపాతల మోషే, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మహాశివరాత్రి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు: నియోజకవర్గ ప్రజలకు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని పుణ్యక్షేత్రాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

శివాలయం ముస్తాబు


ప్రజాశక్తి-గుడ్లూరు: శివరాత్రి పర్వదినం రోజున వేడుకలు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు మండల నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విద్యుత్ ప్రభ ఏర్పాటు చేయడం జరిగింది. పాటల పోటీలతో పాటుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు

తిరుపతి నాయుడుకు నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు: సీనియర్ న్యాయవాది కీర్తిశేషులు ఒలేటి తిరుపతి నాయుడు 20 వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కందుకూరు కోర్టులో జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. తిరుపతి నాయుడు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎన్ విజయబాబు, కందుకూరు అడిషనల్ సివిల్ జడ్జి పూర్ణమా దేవి, కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఒలేటి శ్రీధర్ నాయుడు, న్యాయవాదులు కెవి లక్ష్మీనారాయణ, బెజవాడ కష్ణయ్య, ఎం మల్లికార్జునరావు తదితర న్యాయవా దులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం



నరసారెడ్డి మృతికి నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని పాలూరులో మృతిచెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఆళ్ల నర్సారెడ్డి భౌతికకా యాన్ని కందుకూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పిం చారు. నర్సారెడ్డి కుటుంబ సభ్యులను నాగేశ్వరరావు పరామర్శించి ఓదార్చారు.ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు సూరె వినోద్ కుమార్ రెడ్డి, నాయకులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, బుస్సారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, రామాల శ్రీనివాసరెడ్డి, పులిచర్ల సుధీర్ రెడ్డి, ఇతర నాయకులున్నారు.

డిగ్రీ కళాశాలలో 'ఓపెన్ డే'

ప్రజాశక్తి-ఉలవపాడు: కళాశాల విద్యా కమిషనర్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించుకోవడానికి ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జి.ఎల్. సుధారాణి అధ్యక్షతన చేపట్టారు. ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మా కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను ఉపయోగించి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఉత్తమ విద్యా బోధన జరుగుతుందని తెలియజేశారు. కళాశాలలోని అధ్యాపకులు తమ తమ విభాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎస్.ఎం జూనియర్ కళాశాల, ఉలవపాడు విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన సిఎం:మంత్రి కాకాణి

ప్రజాశక్తి-పొదలకూరు

భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో శుక్రవారం జరిగిన "మా నమ్మకం.. నువ్వే జగన్"కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రతి హామీ నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలని, ప్రజలను మోసం చేయకూడదని ముఖ్యమంత్రి మొదటి నుంచి చెప్పేవారని తెలిపారు. తమ పార్టీ గెలిచిన మొట్టమొదటి సంవత్సరం నుంచి ప్రజల కోసం అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. చెప్పింది చేయడం.. చేయగలిగిందే చెప్పడం.. ముఖ్యమంత్రి జగన్ మనస్తత్వం అని పేర్కొన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు రెండేళ్లు చూపించాడని, అధికారంలోకి వచ్చాక మూడు పంగనామాలు పెట్టాడని విమర్శించారు. మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశాడని దుయ్యబట్టారు. ఎన్నికల్లో గెలుపోటములను నిర్దేశించేది తటస్తులేనని పేర్కొన్నారు.పార్టీ ఇచ్చిన బ్యాగ్ ను భుజాన తగిలించుకుంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని,ముఖ్యమంత్రి జగనన్నను భుజస్కందాలపై మోసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అవుతుందన్నారు. సంచిని తగ్గించుకోవడం ఒక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ కోనం బ్రహ్మయ్య, సచివాలయాల పొదలకూరు మండల ఇన్ ఛార్జ్ బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, గహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వైకాపా నాయకులు గోగిరెడ్డి గోపాల్ రెడ్డి,మూలి సతీష్ కుమార్ రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి ,మొలబంటి శేఖర్, షేక్ అంజాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రోడ్‌షోను అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-పొదలకూరు,

బలభద్రాపురంలో పోలీసులు చంద్రబాబును అడ్డుకోవడంతో రాష్ట్రం లో వైసీపీకి కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందనిటిడిపి మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు , పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి.మల్లికార్జున్ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సంగం రోడ్డు కూడలి వద్ద మండల టిడిపి నాయకులు కార్యకర్తలు చంద్రబాబునాయుడు పై పోలీసుల తీరుకు నిరసనగా టీడీపీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు.తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మూడో రోజు పర్యటనలో పోలీసు అనవసర ఆంక్షలు విధించడం పై పొదలకూరు నాయకులు మండిపడ్డారు.చంద్రబాబు అనపర్తి రాకుండా బలభద్రాపురంలో పోలీసులు అడ్డుకోవడం, రోడ్డుకు అడ్డంగా లారీలు, పోలీసు వాహనాలు నిలిపి అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు వాహనశ్రేణికి అడ్డంగా కానిస్టేబుళ్లను అధికారులు కూర్చోబెట్టడం దుశ్చర్య గా పేర్కొన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్య నాయుడు, పులిపాటి.వెంకటరత్నం నాయుడు, జమీర్, భాస్కర్ రెడ్డి, దేవినేని శరత్, సందీప్, కండె సురేష్, పిన్నెం ప్రభాకర్ ,మద్దిరిళ్ళ నరసింహులు, సుబ్బా నాయుడు, నారప నాయుడు, సాధంగిరి ,మురళి,బాలచంద్ర, తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు అభినందనలు



ప్రజాశక్తి-ఉదయగిరి : గడ్డంవారిపల్లి విద్యార్థులు ఖోఖో పోటీలో ద్వితీయ స్థానం సాధించడంపై ప్రధాన ఉపాధ్యాయుని శివయ్య ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గడ్డంవారిపల్లి జెడిపి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులను పిఇటి ఉపాధ్యాయులు వెంకటేశులను అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని వింజమూరులో జరిగిన 98వ గ్రిగ్స్ పోటీలో ఖోఖో పోటీలో విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం అందుకు సహరించిన పిఇటి ఉపాధ్యాయులను అభినందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలపై అవగాహన



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని పంటవీధి సచివాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ సంచాలకుల వి.దేవసేనమ్మ హాజరై మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కనీస మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా అమ్ముకునే ప్రక్రియను పాటించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కనీస మద్దతు ధర వివరాలు వరి ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా అమ్మే ప్రక్రియను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన ఇందిరమ్మ



ప్రజాశక్తి-జలదంకి : పోలీస్ స్టేషన్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వీరేంద్రబాబును మండల కన్వీనర్ చేవూరి జనార్దన్‌రెడ్డి ఆదేశాలతో జలదంకి సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ మర్యాదపూర్వకం కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఆమెతో పాటు శివాలయం గుడి చైర్మన్ వాక శ్రీనివాసులురెడ్డి, వాక వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ దగ్గుమాటి శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశ్వస్వామి గుడి చైర్మన్ బొచ్చు అనిల్ కుమార్‌యాదవ్, ఉదయగిరి సోషల్ మీడియా కో కన్వీనర్ నెల్లాటి మహేంద్ర, జలదంకి సోషల్ మీడియా కన్వీనర్ దేగ సురేష్ యాదవ్, వివేక్, ఒంగోలు రవి క్రిష్ణ, రామయ్య, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఓర్వలేకనే అసత్య ప్రచారాలు

ప్రజాశక్తి-కొడవలూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణను చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నార్తురాజుపాలెం వైసిపి కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్న భయంతోనే నాలుగు పత్రికలు, ఛానళ్లతో కూడిన పచ్చ మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుందన్నారు. కొత్తగా నియమితులైన గృహ సారథులపై ఎంతో నమ్మకంతో గొప్ప బాధ్యతను అప్పగించినట్లు ఎంఎల్ఎ అన్నారు. వారంతా వలంటీర్ల సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్, డిఎల్‌డిఎ చైర్మన్లు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్, డిఎంఐ చైర్మన్ దొడ్లరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జెడ్‌పిటిసి పి.సరోజనమ్మ, ఎంపిపి జి.జ్యోతి, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయ కన్వీనర్ మండల కన్వీనర్ కొండ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న ఎంఎస్ఆర్‌లో 'ప్లేస్‌మెంట్'



ప్రజాశక్తి-కావలి : బహుళ జాతి సాఫ్ట్‌వేర్ కంపెనీ "టెక్ మహీంద్రా" సోమవారం ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి వేతనంతో బహుళజాతి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం కల్పించేందుకు లక్ష్యంగా కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల విద్యార్థులకే కాకుండా ఏ కళాశాల విద్యార్థులైనా, ఏ ప్రాంతం వారైనా ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. 2019, 2020, 2021, 2022లలో డిగ్రీ పాస్ అవుట్ అయిన విద్యార్థులు, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దర్గాను ప్రభుత్వంలో చేర్చడం హర్షణీయం



ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ ఆధీనంలో ఎఎస్‌పేట దర్గాను చేర్చడం హర్షించదగ్గ విషయమని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాళ్ళీ యస్దాని పేర్కొన్నారు. శుక్రవారం వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాళ్ళీ యస్దాని, ఉదయగిరి మర్యాజాహుస్సేన్ మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఎ.ఎస్.పేట దర్గా బాధ్యతలను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు తీసుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. ఎ.ఎస్.పేట దర్గాను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి తీసుకోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్దనున్న మాజీమంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను శుక్రవారం మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి పరిశీలించారు. విగ్రహం వెనుక వైపున ఆర్చ్ నిర్మాణాన్ని పరిశీలించి ఇంజినీర్లకు పలు సూచనలు అందజేశారు. ఆయనవెంట జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, స్థానిక వైసిపి నాయకులు ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలు



ప్రజాశక్తి-బిట్రగుంట : గంగా పార్వతి సమేత నాగలింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బోగోలు మండలం నాగులవరం గ్రామంలో తొలి రోజు నవగ్రహ మండప నిర్మాణం చేసిన మాజీ సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కండ్ల గుంట.మధుబాబు నాయుడు, సౌజన్య దంపతులు తొలిరోజు శుక్రవారం ఉభయకర్తలుగా త్రికాల పూజ నవగ్రహ మండప రాధన, హోమం లఘు పూర్ణ పూర్ణ హారతి, మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు కోట ఆనంద శర్మ ప్రత్యేక పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హోమాన్ని ఆలయ నిర్మాణ దాతలు పెద్దూ సూర్యనారాయణ అమ్మాజీ దంపతులు గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొని హోమాన్ని నిర్వహించారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని ఇస్కపల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్, ఆయన సతీమణి సుజన శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పాల్గొని శివనామస్మరణ పొందుతారని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈసంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి ప్రాంతానికి చెందిన శరవణ్ (45) తన మోపెడ్ వాహనంలో మండలంలోని సాలిపేట నుంచి వస్తూ ముందు వెళుతున్న ట్రాక్టర్ వెనుక భాగంలో ఢీ కొట్టాడు. దాంతో శరవణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాట విషయంలో వివాదం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఉద్రిక్తతకు దారి తీసిన బాట వివాదం పోలీసుల జోక్యంతో ప్రశాంతంగా పరిష్కారమైన ఘటన మండలంలోని తోటపల్లి పంచాయతీ కామాక్షి నగర్ వద్ద కాలనీలోకి వెళ్లే రహదారి విషయంలో నవీన్ అనే వ్యక్తికి, అదే ప్రాంతానికి చెందిన పోలా మస్తాన్ వ్యక్తికి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీయడంతో సమాచారం అందుకున్న కృష్ణపట్నం సిఐ కె.వేమారెడ్డి, ఎస్ఐ కె.ఇంద్రసేనా రెడ్డి పోలీసు సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలికి చేరుకున్నారు.

హఫీజ్ పాషా తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి-నెల్లూరు : ఎఎస్‌పేట మండలంలోని రెహ్మతాబాద్ దర్గా ముతవల్లిగా ఉన్న హఫీజ్ పాషాను తొలగించాలని వక్ఫ్ బోర్డు దర్గా కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని దర్గా పరిరక్షణ కమిటీ అవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రఫీలు తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి

రెగ్యులర్ టైం స్కేల్ ఇవ్వాలి

ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి



పచారం నిర్వహిస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-కలిగిరి

గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులకు అందరికీ రెగ్యులర్ టైం స్కేల్ ఇవ్వాలనీ పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలిగిరిలో ఎన్నికల క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సచివాలయం ఉద్యోగులకు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పరీక్షల పేరుతో 2సంవత్సరాల 9 నెలలు సర్వీస్ పూర్తి చేసినా, వారికి రెగ్యులర్ టైం స్కేల్ ఇవ్వకపోవడం గర్హణీయమన్నారు. రెండు సంవత్సరాల ప్రొబేషనరీ కాలంలో రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా వారికి ఆర్థిక నష్టం చెయ్యడం ఖండిస్తున్నానని తెలియజేశారు. 3 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినా సచివాలయం ఉద్యోగులకు ప్రమోషన్ ఛానెల్ ఏమిటో నేటికీ ఉత్తర్వులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. జూనియర్ లైన్‌మెన్ విధులు ఎక్కడ నిర్వహించాలో, వారికి సమయపాలన విషయంలో స్పష్టత లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మహిళ పోలీసులు ఐసిడిసికి చెందుతారా, లేక హోం డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించాలా స్పష్టత లేదన్నారు. గ్రామ సర్వేయర్లతో వెట్టి చాకిరీ చేయిస్తూ రాత్రి 10 గంటల వరకు పని చేయిస్తున్నారని విమర్శించారు. ఇక ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో 6 డిపార్ట్మెంట్లలో ప్రమోషన్ ఛానెల్ ఏమిటో ఎవరికీ తెలియదన్నారు. వార్డు శానిటరీ సెక్రటరీ నిర్ధిష్ట పని వేళలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ -5 వారికి డిడిఒ అధికారాలు ఇస్తున్నట్లు ప్రకటించారు కానీ ఆచరణలో లేదన్నారు. మీ సర్వీస్ విషయాలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ఈ సమస్యల పరిష్కారం కోసం తాను చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలియజేశారు. కావున సచివాలయం గ్రాడ్యుయేట్ ఉద్యోగులు అందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.



కావలిలో ప్రచారం..

ప్రజాశక్తి-కావలి : స్థానిక బుడంగుంట ప్రాంతంలో శుక్రవారం పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రజా సంఘాల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కలిసి నిత్యం రైతులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడేందుకు పిడిఎఫ్ తరుపున పట్టభద్రుల ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకలు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వై.క్రిష్ణమోహన్, బి.కృష్ణయ్య, తపి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జె.వి.వి. ఆధ్వర్యంలో పాటల పోటీలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్ భవనంలో అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సైన్స్ వారోత్సవాలలో భాగంగా 5వ రోజున నిర్వహించిన సందేశాత్మక పాటల పోటీలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్‌ను, పర్యావరణ పరిరక్షణను, దేశభక్తిని ప్రమోట్ చేసే విధంగా పాటల పోటీలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో 30 స్కూళ్ల నుండి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6,7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా విభజించి, జూనియర్స్ విభాగానికి ఎస్.రామచంద్రరావు, టి.జయశ్రీలు న్యాయ నిర్ణేతలుగా, అదేవిధంగా సీనియర్స్ విభాగానికి స్వర్ణలత, ఎం.సాయి లక్ష్మీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి రెడ్‌క్రాస్ భవనంలో జూనియర్స్‌కు, సీనియర్స్‌కు విడివిడిగా క్విజ్ పోటీలు జరుపబడుతుందని తెలియజేశారు. విద్యార్థులను ఈ పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక తరపున ధన్యవాదాలు తెలియజేశారు. సెక్రటరీ గాదిరెడ్డి.హరినాథ్, ఉపాధ్యక్షులు పాపిశెట్టి. జానకిరామ్, కందికట్టు నారాయణ, సంయుక్త కార్యదర్శులు ఎస్.కె.ఖాదర్‌బాషా, శ్రీకర్ల. వెంకయ్య, జన విజ్ఞాన వేదిక సీనియర్ సభ్యులు కె.జాన్, ఎస్.రమణయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జె.వి.వి.పట్టణాధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు


కళాకారులకు సత్కారం



ప్రజాశక్తి-కావలి : ప్రాచీనులు అందించిన బుర్రకథలో ఆనందమే వేరని, ఇలాంటి కళకు సాటి ఏదీ లేదని పలువురు కొనియాడారు. కావలి పాత ఊరు శివాలయంలో నిర్వహిస్తున్న భ్రమరాం బికా సమేతా మల్లికార్జున స్వామిబ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి గుంటూరు బాబ్జీ బృందంతో ప్రదర్శించిన అల్లూరుసీతారామ రాజు బుర్రకథ పాత తరం వారినే కాక, కొత్త తరంను కదలనీయకుండా చేసింది. ప్రదర్శన అనంతరం ధర్మకర్త కసవరాజు కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ వంశపారంపర్య అర్చకులు శశిగురుకుల్ బాబ్జీ బృందాన్ని ఘనంగా సత్కరించారు. బుర్రకథతో పాటు హరికథ, పౌరాణిక నాటకాలకు అవకాశం కల్పిస్తూ ప్రాచీన సాంప్రదాయాలను పాటింప చేస్తున్న వైనంపై శశిని కళాకారుడు దొడ్ల సదాశివ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు జయప్రతాప్ రెడ్డి, హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు సూర్యనారాయణలు అభినందించారు.

అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి-కావలి



తొలగించిన కణిత



డాక్టర్ కె.ఆనంద్ కుమార్

కావలిలోని ప్రముఖ ఆనంద్ హాస్పిటల్‌లో గురువారం రాత్రి 8 ఏళ్లుగా కడుపులో కణితితో బాధ పడుతున్న మహిళకు 2కేజీల 18 సెంటిమీటర్ల వ్యాసార్థం గల కణితిను ప్రముఖ సర్జన్ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్ ఆపరేషన్ ద్వారా తొలగించారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ భారతి, డాక్టర్ వెంకట్ సహాయకులుగా భవాని సిస్టర్ పాల్గొన్నారు.


విజయదీపిక స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విజయదీపిక స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, జిల్లా ఉన్నత పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు విజయ దీపిక స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి చదివే ప్రతి విద్యార్థికీ ఈ విజయ దీపికలను అందించాలని, పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులతో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకొని ఈ స్టడీ మెటీరియల్‌లోని కంటెంట్‌ను ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా సులభరీతిలో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జిల్లా ఉన్నత పాఠశాల అపసముద్రం ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ఉన్నత పాఠశాల కృష్ణంపల్లి ఉపాధ్యాయులు డి.రమేష్ పాల్గొన్నారు.

అరాచకాలను బయటపెడతా..



ప్రజాశక్తి-కావలి : మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వైసిపి నాయకులు కనమర్లపూడి వెంకట నారాయణ అరాచకాలు, దౌర్జన్యాలు ప్రశ్నిస్తే పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ నుంచి తనను తొలగిస్తారా అని, కనమర్లపూడి 6 పేజీల అరాచకాల చిట్టా బయటపెడతానని, టిడిపి వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు కోట రమేష్ మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని "జర్నలిస్ట్ క్లబ్"లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను గత 20 సంవత్సరాలుగా కావలి పాన్ బ్రోకర్స్ అసోసియేషన్‌లో ఉపాధ్యక్షులుగా, సభ్యుడుగా ఉన్నానని, అయితే పాన్ బ్రోకర్ అసోసియేషన్ అధ్యక్షుడు వైసిపి నాయకులు కనమర్లపూడి నారాయణ అరాచకాలను ప్రశ్నిస్తే మాజీ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు తనపై వ్యక్తిగత దూషణలు చేసి తొలగించారని తెలిపారు. ఏమైనా ఉంటే కనమర్లపూడి నారాయణ మాట్లాడాలన్నారు. చక్కా సుబ్బారావు కోట్ల రూపాయలు సంపాదించి, కుమారుడు ప్రభుత్వ పింఛన్ ఎలా తీసుకుంటారన్నారు. కరోనా సమయంలో రూ.3 లక్షల 58 వేలు అసోసియేషన్ నుంచి దండామని, వాటిలో రూ.58 వేలు మాత్రమే ఖర్చు పెట్టారని తెలిపారు. మిగిలిన డబ్బులు ఎంఎల్ఎ ప్రతాప్ కుమార్‌రెడ్డికి ఇచ్చామని చెప్తున్నారన్నారు. అయితే వీటిని ప్రశ్నించిన తనను ఏకపక్షంగా ఎలా తొలిగిస్తారని ప్రశ్నించారు. తనను పాన్ బ్రోకర్ అసోసియేషన్ నుంచి తొలిగించాలంటే సభ్యుల తీర్మానం మేరకు 2/3 మెజారిటీ ఉండాలన్నారు. అలా కాకుండా ఎలా తొలిగించారో తెలపాలని కోరారు. తనను వారం రోజులలో మరలా చేర్చుకోకపోతే సొసైటీ ఆఫ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద కోర్టుకు వెళ్తానని హెచ్చరించారు.

టిడిపితోనే రాష్ట్రంలో సుపరిపాలన

ప్రజాశక్తి-కావలి

నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని టిడిపి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం 40వ వార్డులో ఆయన "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రజలు టిడిపి ఈసారి అధికారంలోకి వస్తుందని చెబుతూ.. మాలేపాటికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భగా ప్రతిఒక్కరితో మాట్లాడుతూ వార్డులోని సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వసూలు చేస్తున్న చెత్త పన్నుపై ప్రజలు మండిపడ్డారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లిములకు రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలు వంటి అద్భుతమైన పథకాలను అందించారని ప్రస్తుతమున్న వైసిపి ప్రభుత్వం ముస్లిములకు అన్యాయం చేసిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఈ కావలి పట్టణంలో ఏ ఒక్క అభివృద్ధి పనైనా చేసారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్లు అస్తవ్యస్తం చేసి ఇసుక, గ్రావెల్ దోచుకోవటం సరిపోయిందని, కనీసం రోడ్డు వేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని స్లోగన్లు వినిపించారు. వార్డులోని చిన్నారులకు చాక్లెట్లు పంచుతూ.. జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతు గంటి అలేఖ్య, పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, 40 వార్డు అధ్యక్షులు షేక్ రఫీ, వార్డు ముఖ్య నాయకులు రవి, కుందుర్తి కిరణ్ కుమార్, షేక్ మస్తాన్, తటవర్తి వాసు, గుండ్లపల్లి శివాజీ, మల్లి రమణయ్య, మంచాల ప్రసాద్, కావేటి చిన్నకోటయ్య, పోతు గంటి శ్రీకాంత్, మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ ఇస్మాయిల్, నలమోతు శ్రీనివాసులు, గద్దె కొండయ్య, సుబ్బారావు, శేఖర్, కె.అశ్వి ని, షకీలా, లక్ష్మీదేవి, శారద, ఆనందమ్మ, మెహరు న్నీసా, పఠాన్ అమీర్, గొట్టిపాటి రాము, అజయ్, మనోహర్, నాయబ్ రసూల్, కాకుమాని మాల్యా ద్రి, ఇస్మాయిల్, హుస్సేన్, బాలాజీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు



విద్యార్థులకు పరీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రజ్ఞా వికాస్ 10వ తరగతి మోడల్ పరీక్షలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలలలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు సుమారు 300మంది విద్యార్థులు హాజరైనట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 2019లో జాతీయ విద్యా విధానం ఫీజుల పెంపు, ఐఐటీలో ఐఐటీలలో రిజర్వుడ్ విద్యార్థుల తక్కువ ప్రాతినిధ్యంపై నిరసన వ్యక్తం చేసిందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదర్, మణీ, హరి, దావూద్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్స్ సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా శాఖ ప్రభుత్వ పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం రేపు సాయంత్రం భక్తవత్సలనగర్ నందలి పెన్షనర్స్ సంక్షేమ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్.వి.ఎస్ మూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు, ఎంఎల్‌సి విటపు బాల సుబ్రహ్మణ్యం హాజరై సలహాలు ఇస్తారన్నారు.

వ్యవసాయానికి తొలి ప్రాధాన్యత అవసరం

ప్రజాశక్తి-అల్లూరు

వ్యవసాయానికి తొలి ప్రాధాన్యత చాలా ముఖ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని ఇందుపూరు సమీపంలోని అన్నదాత శ్రీనివాసులుకు సంబంధించిన వ్యవసాయ భూముల్లో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక (డాట్ సెంటర్) కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ రైతులకు అనేక సలహాలు సూచనలు అందజేసి రైతుల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రీడర్ శ్రీ లక్ష్మీ, దేశీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విశ్రాంత ఎడి రమణయ్య, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ ఓబయ్య, ఎండమాలజిస్ట్ సురేఖ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడరాదని హితవు పలికారు. రైతులు వ్యవసాయంలో అనేక మెళకువలు పాటించాలని తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వరిపై సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు గమనించి పురుగు మందును పిచికారి చేయాలని కోరారు. కొంతమంది అవగాహన లేకుండా అధిక మోతాదులో పురుగు మందులు వాడకం వల్ల తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులకు తెలియజేశారు. అన్నదాత శాస్త్రవేత్తల సహకారంతో బిపిటిలు 3082, 2846, 5204, ఎన్ఎల్ఆర్ 3418, 145, ఎంటియు 1224, 1061, 1318, 1282, 1262, 1271, ఎంసిఎం 125, కెఎన్ఎం 733, ఐఆర్ఆర్ 93, నవార్ రకాల వరి పంటలను వేసి నూతన వరవడికి శ్రీకారం చుట్టారన్నారు. అందరికీ ఆదర్శంగా నిలిచి ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతున్నందుకు అభినందించారు. రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో మిలటరీ శ్రీనివాసులరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులున్నారు.



పంట పొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ట్రెజరీ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్



ఆత్మకూరు పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా ఖజానా ఉపసంచాలకులు డి.గంగాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ఇవాళ ఆత్మకూరు పట్టణంలో సబ్ ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిం చారు. రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సలహాలు సూచనలు అందజేశారు. ఆత్మకూరు సహాయ ఖజానా అధికారి ఆత్మకూరు ఎన్.రవి కుమార్, ఎస్‌టిఒ వి.కిరణ్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఉదయగిరి



ప్రభుత్వ భవనాల్లో అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలో భాగంగా ఫైర్ సామాగ్రి వసతులు ఉన్నాయా లేవాని ప్రభుత్వ కార్యాలయాలను గుర్తిస్తున్నట్లు అగ్నిమాపక అధికారి చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్టర్, సబ్ ట్రెజరీ, తహశీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలను ఆయన సందర్శించి కార్యాలయాలకు చుట్టూ ఉన్న పరిధిని సిబ్బందితో ఆయన గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతి అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయ పరిశీలన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు ప్రభుత్వ వైద్యులకు నిర్లక్ష్యపు రోగం

- రోగులపై అధికారుల నిర్లక్ష్యం
- మెరుగైన వైద్యం ఉన్నా చేయని డాక్టర్లు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు పట్టణంలో 30 పడకల ఆసుపత్రి ఉంది.అక్కడికి రోగులు చుట్టు పక్కల గ్రామాల నుంచి వస్తున్నప్పటికీ సరైన వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఆస్పత్రికి వచ్చే వారందరూ పేదలు కావడంతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ జేబులను చిల్లు చేసుకుంటున్నారు.

మండల పరిధిలోని పడుగుపాడు గ్రామానికి చెందిన పడవల మల్లికార్జున ఆటో డ్రైవర్ కాలి చర్మంపై మచ్చలు రావడంతో ప్రభుత్వ వైద్యులను ఆశ్రయించాడు. దీంతో వైద్య సిబ్బంది రక్త పరీక్షలు ఏమీ లేవని లిక్విడ్ అయిపోయిందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఆ వ్యక్తి తమ వద్ద డబ్బులు లేవు అని, ప్రయివేటు వైద్యశాలకు వెళ్లలేనని దయచేసి రక్తపరీక్షలు చేయాలని వైద్య సిబ్బందిని అభ్యర్థించాడు. కొంత సేపటి తర్వాత వైద్యుడు రక్త పరీక్షలు చేశాడు. మొదట లేవంటూ రోగులను పరీక్షలన్నీ బయట చేయించుకోవాలంటూ పంపించే ప్రయత్నం చేశాడు. తరచుగా ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. గతంలో ఇదే వ్యక్తి డెంగీ పరీక్ష కోసం ఆస్పత్రికి వస్తే తమ వద్ద ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు లేవని బయట చేయించుకోవాలని చెప్పారు వైద్య సిబ్బంది. చేసేదేమిలేక ప్రయివేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. దీంతో ఆ వ్యక్తికి రూ.2వేలు ఖర్చు అయింది. తరువాత ఆ వ్యక్తి వైద్య సిబ్బందిని తన డబ్బు ఖర్చు అయిందని, బాధతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వెంటనే ఆ వ్యక్తికి ఖర్చు అయిన నగదును తిరిగి ఇచ్చేశారు. ఇలా అనేక మంది రోగులు వైద్యుల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

రోగులకు ఆహారంలోనూ అక్రమాలు..

కాన్పులైన బాలింతలకు, జనరల్‌గా అడ్మిట్ అయిన వారికి ప్రభుత్వ వైద్యశాల వారే మూడు పూటలా భోజనం పెట్టాల్సి ఉంది. వారి మెనూలో ప్రభుత్వ డైట్ ప్రకారం, పాలు, గుడ్డు, అరటిపండు, సాంబార్ అన్నం ఇలా మంచి పౌష్టికాహారాన్ని రోగులకి ఇవ్వాలి. కోవూరు ప్రభుత్వ వైద్యశాలలో మాత్రం దీనికి భిన్నంగా ఉంది. ఎవరి భోజనం వారే తెచ్చుకుని తినాలి. ఒక్కోసారి మధ్యాహ్నం మాత్రమే హోటల్ నుంచి భోజనాన్ని మొక్కుబడిగా తెచ్చి పెడతారు. ఎంతమందికి భోజనం పెడు తున్నారో.. ఎంతమందికి భోజనం బిల్లు పెడుతున్నారో తెలియడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

పడవల మల్లికార్జున కోవూరు పడుగుపాడు



రోగులంటే నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకొని పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు..

కుండా విష్ణు, పోతిరెడ్డిపాళెం



ఆస్పత్రికి ఎప్పుడు వెళ్లినా సమాధానం సరిగ్గా చెప్పరు, డాక్టర్లు పట్టీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం లేదు

డాక్టర్ విజేత కోవూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్



రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం లేదు. ఆస్పత్రిలో అన్ని రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అన్ని వైద్య సేవలు చేయడానికి తగిన సిబ్బంది ఉన్నారు. అన్ని రకమైన మందులు అందుబాటులో ఉన్నాయి. దీన్ని సద్వినియోగం చేసుకోండి.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామం గంగవరం కాలవ వద్ద బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న గండవరపు వెంకటేశ్వర్లును సెబ్ ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం పట్టుకున్నారు. ఈ దాడుల్లో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు వద్ద నుంచి 11 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.

IN THE COURT OF THE HON'BLE FAMILY COURT CUM III ADDL. DISTRICT JUDGE MEDCHAL, MALKAJGIRI DIST AT : KUKATPALLY

F.C.O.P.No. 549 OF 2022

BETWEEN:

Smt **A.Gouthami** - Petitioner

AND

Sri. **M.Srinivas** - Respondent

To,

Sri. **M.Srinivas,** S/o Mr. **M. Rama Rao,** aged about 36 years, Occ: Service R/o. Door No. 16/7, Gurramvaripalam, D.V.Nagar, Kandukur Town, SPSR Nellore District, Andhra Pradesh.

Please take notice that the above case was filed against you as respondent for restitution of conjugal rights and the same is posted for your appearance on **04.04.2023 at 10:30 a.m** in person or through an advocate. Incase you do not make your appearance on the said date, you will be set exparte and the matter will be heard in your absence.

BY ORDER OF COURT

M/s. K. Jawahar & Ch. Durga Prasad

Advocates

Unit 1001/2, 9th Floor,
(Adj) Metro Station Ameerpet,
Yellareddyguda, Hyderabad-73

Before The VI^th Addl. Motor Accident Claims Tribunal : Nellore

M.V.O.P.No. 383 / 2022

1. Sita Manjula
2. Sita Srividya - Claimants

Vs

1. E. Kishore (Owner)
and 2 others - Respondents

Notice

To,

R3. T.Prabhu Kumar, (Driver) S/o **Ramanaiah,** D.No.31-11-33-24, Vengalrao Nagar, Kavali Bit-1 (U), Kavali, SPSR Nellore District.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పైన తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే06-03-2023** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టు లోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవల సినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వి.ఎస్. రవీంద్ర కుమార్, బి.ఎ., బి.ఎల్., క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.